బాబాయ్

జంటకొమ్మల్లాంటివి ఆ రెండు ఇళ్లూ. ఒకదాని ప్రక్కన మరొకటి ఉన్నది. రెండింటికీ నిట్టాడి ఒక్కటే; సోపరా ఒక్కటే; ముందు గడప ఒక్కటే; మెరాబాకూడా ఒక్కటే. ఉత్తర దక్షిణాలు తాటాకుల దడి మినహాయించి, రెండింటికీ మరో ప్రహారీ లేదు.

ఉత్తరపు ప్రక్కన ఇంటిలో పరమయ్య ఉంటున్నాడు ఆయన వయస్సు నాలుగు పదులపైన. కాని శరీరదార్ఢ్యం మెండుగా గలవాడు. ఒడ్డూ పొడుగూ గలిగి, కండలు దీరిన అవయవాలతో దేవాలయపు మండిగంలా దిట్టంగా కనబడతాడు. మిన్నతీవమీదున్న మధ్య వయస్కుడు! నవరసాల్లో శృంగార రసంపై ప్రత్యేకమైన అభిమానమూ, అభిరుచీగల రసిక శిఖామణి. భార్య చనిపోయి దాదాపు దశాబ్దమైంది. పిల్లలు లేరు. అప్పట్నుంచీ మళ్ళీ పెళ్లి జేసికోలేదు. కాని స్త్రీ అనుభవం జూస్తే, "ఈ ఊళ్లో నా కౌగిలిలో మల్లెపువ్వులా నలగని ఆడవాళ్లు తక్కువ" అంటూ మీసం మెలివేసి, రొమ్ము విరుచుకుంటూ ఆయన చెప్పుకోవడం కూడా కద్దు.

దక్షిణ ప్రక్కన ఇంట్లో నరసింహయ్య ఉంటున్నాడు. పరమయ్య కంటె ఆయన వయస్సులో ఓ అయిదేళ్ళు పెద్ద. కాని కంటికి పదేండ్లు పెద్దగా కనబడతాడు. జీవిత సమరంలో సంసార భారంలో, కష్టాల కార్ఖానాలో ఆయన శరీరం ఏపారి, ఏనుగ

దేహంలా గిడసబారింది. భార్యా, ముగ్గురు కూతుళ్ళూ, ఇద్దరు కొడుకులూ గల భారీ సంసారం. తాపీపని జేస్తూ ఆ సంసార శకటాన్ని మెరక ఎక్కించేందుకు నానా యాతనలూ పడుతున్నాడు. ఏరోజు ఆయన శరీరం స్వేదాన్ని వర్షించకపోతే, ఆరోజు ఆ ఇంట్లో పొయ్యిమీద కుండ ఎక్కదు. కొడుకులు అందివచ్చినవాళ్లు కాదు. కడగొట్టువాళ్ళు, కూతుళ్ళు ఎదిగినవాళ్లయినా ఇంటి చాకిరీకి పనికివచ్చే వాళ్ళేగాని కుటుంబ భారాన్ని ఏ మాత్రం తగ్గించేవాళ్ళు గాదు. పై పెచ్చు పెద్ద కూతురూ, రెండో కూతురూ పెళ్ళీడు కొచ్చి ఆ భార్యా భర్తలకు గుదిబండ లయినారు.

పెద్దకూతురు సీతాకుమారికి ఇరువయ్యేళ్లు వచ్చాయి. సర్కారు బడిలో చదువున్నంత మేరకు చదువుకుంది. అంద చందాలలో ఏ వంకా వొంపూ లేనిది. ప్రొద్దున్నే పూచిన తెల్లగులాబీలా ఉంటుంది. సహజ స్నిగ్ధసౌందర్యరాశి, సుగుణవతి. కాని ఆమెకు పెళ్లి చేయడానికి ప్రయత్నిస్తూ నరసింహయ్య అయిదేళ్లుగా ఆ వూరు ఆ వూరు తిరుగుతూ ఆరు జతల చెప్పులిన్ని అవతల పారవేశాడు. అయినా ఆమె పెళ్ళి స్థిరపడ లేదు. 'ఈ రోజులలో కట్నం కానుక లిచ్చుకోలేకపోతే, ఆడపిల్ల ఎంత అందమైనదయినా అడవిలో పువ్వే!' అనుకున్నాడు.

పొంతం పొగిలబడ్డ ఆ సాయంత్రం ఇంటిముందు మొరాబాలో కొబ్బరి చెట్టు క్రింద పడక కుర్చీ వేసుకు కూర్చున్నాడు పరమయ్య. సిగరెట్టు కాలుస్తూ ఏదో ఆలోచిస్తున్నాడు. సిగరెట్టు పొగ ఉంగరాలు తిరుగుతూ గాలిలో కలిసిపోతున్నట్టుగానే - ఆయన మనస్సులో ఆలోచనలు ఉంగరాలు తిరుగుతున్నాయి.

నరసింహయ్య తాపీ పనినుంచి ఇంకా ఇంటికి రాలేదు.

ఆయన భార్య శాంతమ్మ ఇంటిముందు ఖాళీ స్థలంలో గోతాం పట్టమీద ఎండబోసిన పెసల్ని పెద్ద దబరా గిన్నెలోకి ఎత్తుతూ న్నది. ఆవిడ కొడుకు లిద్దరూ దూరంగా ఓ మూలనున్న పెంట పోగు దగ్గర బిళ్ళంగోడు ఆట ఆడుతున్నారు. రెండో కూతురు నలిని వసారాలో గుంజకు చేట చేర్పుగా కూర్చుని ఏదో వారపత్రికలో సినిమా బొమ్మల్ని ఆసక్తిగా చూస్తోంది. మూడో కూతురు ప్రక్కింటికి వెళ్ళింది ఆటలకోసం.

ఊళ్ళో అందమైన స్త్రీలను గురించి ఆలోచిస్తున్న పరమయ్య దృష్టి కాకతాళీయంగా ఎదురుగ్గా ముఫై గజాలలో జామచెట్టు దగ్గరున్న పంపుమీదకు మళ్లింది. ఆయన ఆలోచనలు కొత్తదారి త్రొక్కాయి; కొత్త ఉత్సాహాన్ని పుంజుకున్నాయి. ఏదో అనిర్వచనీయమైన ఆనందం గ్లూకోజ్ ఇంజక్షనిచ్చినప్పుడే శరీరంలో కలిగే వేడివలె పొంగి పొర్లింది.

—పంపుదగ్గర సీతాకుమారి బకెట్‌లోకి నీళ్ళు తోడు తున్నది. అప్పుడామె వొంగి వుండడంవల్లనూ, పైట కుడిభుజం మీద నాట్యం చేస్తూండటంచేతనూ - ఆమె సన్నని నడుం వొంపులూ, రొమ్ముల లావణ్యమూ ఆయన చూపులను బర బర లాగేశాయి. గులాబి రేకుల్లాంటి ఆమె చెక్కిళ్ళపై ముని మాపు మెత్తని కాంతులు పడుతూ అందానికి మెరుగులు పెడు తున్నాయి.

నులివెచ్చని ఉద్రేకం నీటి ఆవిరివలె శరీరంలో పొగలూ సెగలూకాగా, పరమయ్య సిగరెట్టు అవతల పారేసి, కుర్చీలో సర్దుకుని కూర్చున్నాడు. కాని దృష్టిని రవ్వంత మళ్ళించలేదు. స్త్రీలో హృదయాహ్లాదాన్ని రేకెత్తించే భాగాలను చూడడం ఆయనకు గొప్ప సరదా. తద్వారా పొందే పరవశత్వం అనుభ

వానికి గీటురాయి.

బకెట్‌తో నీళ్ళు తీసికెళ్ళుతూ ఆయన ముందుగానే నడిచి వెళ్ళింది సీతాకుమారి. బకెట్ బరువుతో ఆమె శాణం బద్దలా వొంగి నడుస్తూంటే - ఆ సౌందర్యపు సొగసుల్ని తిలకిస్తూ పరమయ్య కనురెప్పలు వాల్చలేదు. ఆమె యింట్లోకి వెళ్ళే వరకూ అదేమాపు చూస్తూనే ఉన్నాడు.

...అబ్బ! ఎంత అందంగా ఉంది సీతాకుమారి! ఆ సౌందర్యం. ఆ వొంపులూ, ఆ లావణ్యమూ, ఆ ఆకర్షణా - తను ఏ స్త్రీలోనూ చూడలేదు. ఇట్లాంటి స్త్రీనుంచి పొందని అనుభవంతో తన జీవితం సార్థకత కాదు. ఆమెను తను పెళ్ళి చేసికుంటే! తన బ్రతుక్కు పరిపూర్ణత ఏర్పడుతుంది! తను కబురు చేస్తే నరసింహయ్య కాదంటాడా? కట్నం ఇచ్చుకోలేని దుస్థితిలో ఆమెకు పెళ్ళి చేయలేక నానా అవస్థా పడుతున్నాడు పరమయ్య.

మళ్ళీ ఇంట్లోంచి ఖాళీ బక్కెట్‌తో బయటకొచ్చింది సీతాకుమారి. బకెట్‌ను వూగులాడించుకుంటూ, ఆయన ముందుగా నడుస్తూ. "ఏమిటి బాబాయ్! అదేపనిగా ఆలోచిస్తున్నావ్!" అన్నది సీతాకుమారి - చందమామ వెన్నెల్ని వెదజల్లినట్టు చిరునవ్వు నవ్వుతూ.

ఉండేల్ దెబ్బ తగిలినట్టు పరమయ్య గుండె గతుక్కుమంది. తనను 'బాబాయ్!' అని సంబోధిస్తున్నదేమిటి? తను ఆమెను గాఢాతిగాఢంగా ప్రేమిస్తున్నాడు. అట్లా ఆమె పిలవడం న్యాయమా? సబబా? - తను ఆ ఇంట్లోకి వచ్చిన అయిదేళ్ళ నుంచీ ఆమె అట్లానే పిలుస్తూన్నది. అలవాటైపోయింది.

"బ్రతుకును గురించి ఆలోచిస్తున్నాను సీతా!" అన్నాడు

పరమయ్య ప్రేమగా, ఆప్యాయంగా.

"నీ బ్రతుక్కేం బాబాయ్! కొబ్బరి బొండాంలోని చల్లని నీరు" అంటూ సీతాకుమారి పంపుదగ్గరకు వెళ్ళింది.

ఛి, ఛీ, మళ్ళీ అదేమాట! "బాబాయ్!" "బాబాయ్!" - తనని అట్లా పిలవకపోతే యేం? మృదువుగా, ముచ్చటగా, సరసంగా - "బావా!" అని పిలిస్తే ఎంత పసందుగా వుంటుంది!

—పరమయ్య మనస్సులో తుమ్మముల్లు గుచ్చుకున్నంత పనైంది. మళ్ళీ అంతలోనే తెప్పరిల్లి, బకెట్‌లోకి నీళ్ళు. కొడుతూన్న ఆమెకేసి కొండంత ఆత్రుతతో చూడసాగాడు.

కాని మునిచీకటి చిక్కబడింది. నరసింహయ్యగారింట్లో దీపం వెలిగించబడింది. నట్టింట దీపపుతాలూకు చారలు ఇంటి ముందు మెరాబాలోకి పర్చుకోగా చీకట్లోని పదార్థాల్ని సూటిగా చూసే దృష్టిబలం పరమయ్యలో సన్నగిల్లింది. మళ్ళీ బకెట్‌నిండా నీళ్లు తీసికెళ్ళుతూ ఆయన ముందుగానే సీతాకుమారి వెళ్ళింది. ఆమె మాట్లాడలేదు. మాట్లాడే అవకాశం లేక పరమయ్య కళ్ళప్పగించి చూస్తు కూర్చున్నాడు. ఇంత త్వరగా చీకటి చిక్కబడుతుందని ఆయన అనుకోలేదు.

*　　　*　　　*

పరమయ్యకూ, నరసింహయ్యకూ పూర్వపు బంధుత్వమేమీ లేదు. కాని ఒక కులానికి చెందినవారే. అయిదేళ్ల క్రితం నరసింహయ్య తమ్ముడు ఆ ఇంటి భాగాన్ని అమ్ముకొని జీవికకోసం నైజాం వెళ్ళితే, నాలుగువేల రూపాయలకు ఆ ఇంటిని కొనుక్కొని అందులో ప్రవేశించాడు పరమయ్య. అంతకు ముందు ఆయన భార్య పరలోకగతురాలైంది. మళ్ళీ పెళ్ళి జేసికోలేదు. "పరమయ్యా! ఇంకా గోడదుమికే వయస్సులోనే

ఉన్నావు. మళ్ళీ పెళ్ళి జేసికోక పోయావూ?" అంటూ స్నేహితులు సలహాలిచ్చారు గానీ, "నా శారీరక వాంఛలు తీరే అవకాశాలు లేకపోతేనే గదా?" అంటూ ఆ సలహాల్ని కొట్టి పారవేశాడు. కాని ఇప్పుడిప్పుడే సీతాకుమారిని వివాహం చేసుకోవాలన్న లాలస ఆయనలో మొగ్గతొడిగి, వికసించే దశ కొచ్చింది.

ప్రక్క ప్రక్కనే వుండటంచేత పరమయ్యకూ నరసింహయ్యకూ సహజమైన స్నేహబంధాలు కాలక్రమేణా ఏర్పడ్డాయి. ఏదైనా డబ్బు అవసరమైనప్పుడు నరసింహయ్య ఆయనదగ్గర పుచ్చుకోవడమూ చేతికి రాగానే తిరిగి యిచ్చివేయడమూ జరుగుతూన్నది. పరమయ్యకు ఆడదిక్కులేదు. స్వయంపాకం. అందుచేత నరసింహయ్య భార్య అప్పుడప్పుడూ పిల్లలచేత కూరలూ, పిండివంటలూ పంపుతూ ఉంటుంది. ఆవిషయంలో ఆవిడ సాహసమేమీ లేదు. నరసింహయ్యే స్వయంగా ఆ సూచన చేశాడు. ఇరుగూ పొరుగూ వాసులుగా వాళ్లిద్దరికీ స్నేహం ఉన్నా, ఆ స్నేహంలో ఆత్మీయతా, చనువూ తక్కువ.

వెతికి వెతికి నరసింహయ్య పెద్ద కూతురుకు తెనాలినుంచి ఓ సంబంధం తీసుకొచ్చాడు. వరుడు బుద్ధిమంతుడు. తల్లీ దండ్రీ ఆసరా ఉంది. ఏదో ప్రెస్‌వర్కరు. నెలకు నూరు రూపాయలు తెచ్చుకుంటున్నాడు. అందచందాలకు లోటు కూడా లేదు. ఆ సంబంధం ఖాయపడిడే తన గుండెలమీద బరువు సహం తీసివేసినట్లవుతుందని ఆశపడ్డాడు నరసింహయ్య.

పెళ్లి చూపులు జరిగాయి, పిల్లవాడూ, తల్లి దండ్రులూ, మరో మధ్యవర్తి వచ్చారు. కట్నం కానుకలక్రింద అయిదు వందల రూపాయలిచ్చేట్టు కూడా ఖరారు చేసుకున్నారు. అబ్బాయికి

అమ్మాయి బాగా నచ్చింది. అందుచేత తండ్రి వెయ్యి రూపాయల కట్నం ఇవ్వమని పట్టుబట్టినా, పిల్లవాడి మోజుకొద్దీ కొండ దిగిరాక తప్పలేదు. ఆ పెళ్ళి స్థిరపడుతుందని నరసింహయ్యా, కాంతమ్మా మురిసిపోయారు. ఇంక ముహూర్తం పెట్టుకోవడమే మిగిలింది. ఇంటికి వెళ్ళాక పురోహితునితో సంప్రదించి, లగ్నాలకు తరలి వస్తామనీ, ముందుగా ఉత్తరం ద్వారా తెలియ బరుస్తామనీ చెప్పి వాళ్ళు వెళ్ళారు. అప్పటి నుంచి నరసింహయ్య రోజూ పోస్టాఫీసుకు తీరికచేసుకొనివెళ్ళి వస్తూనే ఉన్నాడు.

సరిగ్గా వారం రోజులకు వాళ్ల దగ్గరనుంచి ఉత్తరం వచ్చింది: ఈ పెళ్ళి మాకు ఇష్టంలేదనిన్నీ, మరో సంబంధం చూసుకోవాల్సిందనిన్నీ.

ఆ భార్యా భర్తలు తలలు తలలు పట్టుకు దుఃఖించారు.

సీతాకుమారి తన దుర్విధిని తల్చుకుని కడుపులో ప్రేవులు కదిలిపోయేట్టు కుమిలి కుమిలి ఏడ్చింది.

వాళ్ళ ఆశలనూ, అడియాసలనూ ప్రక్కింట్లో ఉండే పరమయ్య ప్రత్యక్షంగానే వీక్షిస్తున్నాడు.

*   *   *

అంతటితో నరసింహయ్య కాలి నుసిగా మారిన బొగ్గువలె నీరసించి పోలేదు. అడుగంటిన ధైర్యాన్నీ, ఉత్సాహాన్నీ, కూడగట్టుకొని మళ్ళీ సీతాకుమారికి సంబంధాలు వెతికే ప్రయత్నాలు చేశాడు. మిత్రులనూ, శ్రేయోభిలాషులనూ, పరిచయస్తులనూ, వాకబు చేసి వాళ్ల సహాయ సానుభూతులతో ఓ నెలా పదిహేనురోజుల పిమ్మట మరో సంబంధాన్ని తీసుకొచ్చాడు నరసింహయ్య.

"ఈ సంబంధం తప్పకుండా కుదురుతుంది. నాకు నమ్మక ముంది. ఇది తప్పిపోయిందంటే, ఇక సీతకు పెళ్ళికాదు ఈ జన్మలో" అన్నాడు నరసింహయ్య.

"ఏమో! అన్నింటికీ ఆ భగవంతుడే ఉన్నాడు" అన్నది శాంతమ్మ ఏడుకొండలవాణ్ణి స్మరించుకుంటూ.

"ఇంకా స్వామికి నాపై దయ కలుగలేదు." అనుకుంది సీతా కుమారి నిశ్శబ్దంగా.

ఓ శుభముహూర్తాన పెళ్ళిచూపులు జరిగాయి, పెళ్ళికొడుకు కుదికాస్త ముదిరిన వయస్సు, కాని ద్వితీయంకాదు. సెకెండరీగ్రేడు టీచరుగా ఆతనికి ఎనిమిదేళ్ళ అనుభవం ఉంది. ఇంత కాలమూ అతను పెళ్లి చేసుకోకుండా ఉండి, ఇప్పుడు వివాహానికి సుముఖుడు కావడానికి ఏవేవో కథలు అమలులో లేకపో లేదు. కాని ఆ కథల్ని కట్టు కథలుగా నరసింహయ్య భావించి ముందుకొచ్చాడు.

పెళ్లికొడుకు ఏమంత అందమైనవాడు కాదు. తుమ్మచెక్క మొహం. సన్నగా, ఆకులురాల్చిన సర్విచెట్టులా ఉన్నాడు. కొంగ మెడ, నర్సారావుపేట బావులలోని నీరులా లోతైన నేత్రాలు, ముక్కు మూడంగుళాల పొడవుంది. వెయ్యిమంది జనంలో ఎత్తుగా, నిచ్చెన నిలబెట్టినట్టుగా కనబడే ఆకారం.

అతగాడు సీతాకుమారికి ఏమాత్రం నచ్చలేదు కాని నోరు నొక్కుకున్నది - తండ్రి ఏమైనా అంటాడేమోనని. పెళ్లి చూపుల తతంగంద్వారా చూసి చూసి ఆమెకు మగజాతిపైన ఓ రకమైన దోష దర్శిత్వదృష్టి అలవడింది.

సీతాకుమారి ఆ పెళ్లికొడుక్కి మా బాగా నచ్చింది. ఇట్లాంటి అందచందాల అలివేణికోసమే తను ఇన్నాళ్ళూ పెళ్లి

చేసికోకుండా తాత్సారం చేసిందని మహా ఇదిగా మురిసిపోయాడు. కట్నం కానుకల ప్రసక్తి ఎత్తకుండానే ఆమెను పరిణయ మాడటానికి పెన్నిధి దొరికినంత సంబరంతో ఒప్పుకున్నాడు.

పురోహితుణ్ణి పిలిపించి వెంటనే ముహూర్తంకూడా పెట్టించారు. ఆ ముహూర్తం పదిహేను రోజుల వ్యవధిలో కుదిరింది. పెళ్లికొడుకూ, ఆతని తల్లి దండ్రులూ తను గ్రామం వెళ్ళారు - పెళ్లి పనులకోసం తొందర పడుతూ.

సీతాకుమారి పెండ్లికి ముహూర్త నిశ్చయంకూడా జరిగి పోవడంతో - ప్రక్కింటిలో ఉన్న పరమయ్య శరీరంమీద తేళ్లూ, పాములూ మొదలయిన క్షుద్ర కీటకజాతి పారుకాడ సాగాయి. చీకటి నిండిన చిత్తంతో చిందులు త్రొక్క నారంభించాడు. ఎంత దారుణం? ఎంత ఘోరం? ఆమె కోసం తను యువతల తపించి పోతూంటే, తనని మాట మాత్రం అడక్కుండా - నరసింహయ్య ఆమె పెళ్లి కుదురుస్తాడా? తన బ్రతుకేం గావాలి? తనకు వయస్సు ఉంది; అంద చందా లున్నాయి; ఆస్తి ఉంది; పేరూ పలుకుబడీ ఉన్నాయి. తనకంటె ఆ చువ్వగాడు సీతాకుమారికి తగిన వరుడా? ఆమె ఎట్లా ఒప్పుకుంది ఈ బలవంతపు పెళ్లి? అనుకుని పరమయ్య చీకాకు పడ్డాడు.

ఒకరోజు మధ్యాహ్నం సీతాకుమారి ఒంటరిగా ఇంటి వసారాలో తిరుగుతూంటే, తన ఇంటికి పిల్చాడు పరమయ్య.

"ఈ పెళ్లి నీకు ఇష్టమేనా, సీతా?" అన్నాడు పరమయ్య ఆవేశాత్మకంగా.

"నా ఇష్టాలతో పనేముంది బాబాయ్!" అన్నది సీతాకుమారి నివురు గప్పిన నిర్లిప్తతతో.

పరమయ్య మనస్సుకు ఈతముల్లు గుచ్చుకుంది-'బాబాయ్!' అన్న సంబోధనతో, తన ప్రేమనూ, ఉద్దేశ్యాన్నీ, ఉత్కంఠనూ వెళ్ళగ్రక్కాలనుకున్న ఆయన గొంతులో గులకరాళ్ళు అడ్డు వచ్చాయి. ఏం మాట్లాడలేక ముఖం వ్రేళ్ళాడవేశాడు.

నలిగిన నల్లేరులా నిట్టూర్పు విడుస్తూ సీతాకుమారి వెళ్ళింది.

*　　*　　*

పెళ్ళి ఇంకా మూడు రోజులుందనగా ఓ మధ్యాహ్నం నరసింహయ్యగారి ఇంటిలో హఠాత్తుగా గాలి స్తంభించింది.

అది రానున్న గాలివానకు సూచనగా గ్రహించాడు ప్రక్క ఇంటిలో ఉన్న పరమయ్య.

కొన్ని నిముషాల అనంతరం ఆ ఇంటిలో నిజంగా గాలివాన ఛాయలే కనిపించాయి.

"ఈ ముదనష్టపు ముండకు యిక జీవితంలో పెళ్ళే కాదు!" అన్నాడు నరసింహయ్య బిగ్గరగా. ఆ కంఠంలో ఏదో తీవ్రమయిన ఆగ్రహమూ, ఆవేదనా, కసీ కలిసికట్టుగా ధ్వనించాయి.

శాంతమ్మ సన్నగా ఏడ్పు సాగించింది.

నరసింహయ్య పెద్దకూతురుకు పట్టిన దుర్గతిని నానా శాపనార్థాలద్వారా వెళ్ళగ్రక్కుతున్నాడు. అయిదేళ్ళుగా కడుపులో పుండువలె పెరిగిన సహనం ఆయనలో ఒక్కసారిగా పగిలి బ్రద్దలైంది. దానితో ఉచితానుచితాలు విస్మరించి సీతాకుమారినీ, ఆమె దురదృష్టాన్నీ, లోకంలో పెచ్చరిల్లిపోతున్న కుళ్ళునూ, దుర్మార్గాన్నీ, భగవంతుని కాఠిన్యతనూ వైన వైనాలుగా తిట్టసాగాడు.

సీతాకుమారి కుక్కిన పేనులా మంచం కుక్కిలో మూడు అంకె వేసికొని పడుకుని కళ్ళద్వారా కుంభవృష్టిని కురిపిస్తోంది.

—పరమయ్య సంగతి సందర్భాలను ఇట్టే గ్రహించాడు. సీతాకుమారి పెళ్లి మళ్ళీ తప్పిపోయింది. అవతలవాళ్ళు "మీ సంబంధం మాకు అక్కర్లేదు." అంటూ ఉత్తరం వ్రాసి వుంటారు. ముహూర్తం నిర్ణయించబడ్డ పెళ్ళి జారిపోతే నిజంగా ఏ తండ్రయినా ఏం చేయగలడు? అసలు తనలాటివాణ్ణి ఇంటి ప్రక్కన పెట్టుకొని ఆ నరసింహయ్య దూరపు కొండలకేసి పోవడం ఏం బాగులేదు! అందుచేతనే ప్రతిసారీ ప్రొద్దెదురు! అట్లాంటి శాస్తి జరగ వల్సిందే!...ఇప్పటికైనా అడుగుజారి అతనిని అడక్క పోతాడా? అనుకున్నాడు పరమయ్య.

ఆ రోజు సాయంత్రం అయిదు గంటలకు నరసింహయ్యగారి ఇంటిలోంచి హఠాత్తుగా ఏడ్పులు వినవచ్చాయి. నరసింహయ్య ఇంటిలో లేడు.

పరమయ్య పరుగెత్తుకుంటూ ఆ ఇంటిలోకి వెళ్ళాడు.

పెళ్ళి ఆగిపోయిన అవమానాన్నీ, తండ్రి తిట్లనూ, లోకాపనిందనూ భరించలేక సీతాకుమారి అఘాయిత్యానికి తలపడింది. ఎవ్వరూ లేకుండా చూసి వంటగదిలో వంటినిండా కిరసనాయిలు పోసుకొని అగ్గిపుల్ల అంటించుకుంది. చిన్నతమ్ముడు చూసి తల్లిని కేక వేశాడు. తల్లి వచ్చి మంటలు ఆర్పడానికి నానా ఖంగారూ పడేసరికే సీతాకుమారి శరీరం చాలా భాగం కాలి మసిబొగ్గయింది. నేలమీద కుప్పగా కూలిపోయింది.

ఆమె వికృతాకారాన్ని చూసి పరమయ్య నిలువెల్లా శిలా ప్రతిమవలె స్తంభించి పోయాడు.

సీతాకుమారిని వెంటనే ఊళ్ళోవున్న ఎల్. ఎఫ్. డిస్పెన్సరీలో చేర్చారు. ఆమె చావు బ్రతుకుల్లో ఉంది. పరమయ్య ఆమె మంచం దగ్గర నేరస్థునిలా కూర్చున్నాడు. ఆయన

మొహంలో కత్తిగీటుకు నెత్తురుచుక్క లేదు.

"బాబాయ్!....బాబాయ్!" అన్నది సీతాకుమారి మెల్లగా.

పరమయ్యలో దుఃఖం పెల్లుబికి, పశ్చాత్తాపం రూపంలో బయటికొచ్చింది.

"నేను...దుర్మార్గుణ్ణి సీతా!...నన్ను క్షమించు నీ మీద ప్రేమాభిమానాలతో, నిన్ను పెళ్ళి చేసుకోవాలన్న తలంపుతో ...నీ జీవితాన్ని నాశనం చేశాను. నిన్ను దారుణంగా బలి చేశాను...నీకు వచ్చిన సంబంధాలను చెడగొట్టింది నేనే, ఈ పెళ్ళికూడా చెడిపోవడానికి నేనే కారకుణ్ణి, నన్ను క్షమించు సీతా!"

మునిమాపులో లీనమై పోనున్న సూర్యాస్తమయ కాంతిలా పేలవంగా నవ్వింది సీతాకుమారి.

"నీ మనస్సు నాకు తెలుసు బాబాయ్! కాని మన పెళ్ళి అసాధ్యం, జరిగేది కాదు. వచ్చే జన్మలో నీకు భార్యగా పుడతాను బావా!" అన్నది సీతాకుమారి సత్తువను కూడగట్టుకొని.

(యువ)